క్లుప్తంగా

రోడ్లకు మహర్దశ

వేములవాడ: నియోజకవర్గంలోని పలురోడ్లకు మహర్దశ పట్టనుంది. వేములవాడ నియోజకవర్గంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) పథకం కింద రోడ్ల నిర్మాణాలు చేపడతున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల హమ్ విధానంలో రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందన్నారు. వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి వయా మర్రిపల్లి, మర్రిగడ్డ, చందుర్తి, రుద్రంగి, పోశానిపేట, కథలాపూర్ మీదుగా కోరుట్ల వరకు, చందుర్తి మండల పరిధిలో చందుర్తి-మోత్కురావుపేట మధ్య 10 కిలోమీటర్లు, కోనరావుపేట మండల పరిధిలో మామిడిపల్లి-నిజామాబాద్ మధ్య 4.70 కిలోమీటర్లు, బావుసాయిపేట-వెంకట్రావుపేట మధ్య 3.30 కిలోమీటర్లు, వట్టిమల్ల-నిమ్మపల్లి మధ్య 2.90 కిలోమీటర్లు, వేములవాడ బ్రాంచ్ రోడ్డు వయా చింతల్‌ఠాణా వేములవాడ మున్సిపల్ వరకు 4.30 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు.

భారీ వర్షం

గంభీరావుపేట: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మండలకేంద్రంతో పాటు గజసింగవరం, నాగంపేట, నర్మాల, లింగన్నపేట తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇప్పటికే పలు చెరువులు మత్తడి దూకుతున్నాయి.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. రెండున్నర గంటలపాటు ఎకధాటిగా కురిసిన వానలతో బతుకమ్మ వేడుకలకు అంతరాయం కలిగింది. దుర్గామాత మండపాల వద్ద నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. ఎడతెరిపి లేని వానతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో జరిగే సద్దుల బతుకమ్మ పండగ కోసం ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. గిద్దె చెరువు ఎంట్రన్స్‌లో, గిద్దె చెరువు వద్ద లైట్స్‌ను, పల్లె ప్రకృతి వనంలో సైతం లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా పల్లె ప్రకృతి వనంలో ఉన్న బతుకమ్మ ఘాట్‌ను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆంజనేయులు ఉన్నారు.

శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలి



వేములవాడరూరల్ : ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో స్వయం సేవకులు పాల్గొని విజయవంతం చేయాలని పురాణం రాము అన్నారు. వట్టెంలలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఎన్నో సేవా కార్యక్రమాలతో భారతమాత సేవకై నిత్యం కదులుతుందని అన్నారు. రానున్న దసరాతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప మండల ప్రముఖ్ బారాజు కిషన్ రెడ్డి, ప్రచారక్ సాయిరాం, శిశుమందిర్ సంచలన సమితి సభ్యులు ఘర్షకుర్తి వెంకటేశ్వర్లు, బౌద్ధిక్ ప్రముఖ్ మ్యాన ప్రసాద్, మంద రాజేందర్, సింగరవేణి హరీశ్, మహేందర్, మంద ఆంజనేయులు, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన తాళ్లపల్లి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల రైతుబీమా చెక్కును సోమవారం నాయకులు అందజేశారు. చెక్కు మంజూరుకు కృషిచేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏవో రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, సాహెబ్, వంగ గిరిధర్ రెడ్డి, గంట బుచ్చాగౌడ్, వెంకటేశ్, మూర్తి, కల్లూరి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

వీర్నపల్లి: మండలంలో ని బాబాయి చెరువు తండాలోని వరి పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. వరి పంటలో కంపునల్లి లక్షణాలు గుర్తించారు.

విరాళం అందజేత

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన నేవూరి చంద్రయ్య రూ.10 వేల నగదును ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భార్గవి దేవికి సోమవారం అందజేశారు. కళాశాల అభివృద్ధికి విరాళం అందజేసిన చంద్రయ్యను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.



గౌరమ్మను వేడుకుంటాం



ఆడపడుచులు పుట్టింట్లో చీరె..సారె పొంది సంతోషంగా ఉత్సవం జరుపుకుంటారు. పసుపు, కుంకుమలు చల్లగా కాపాడాలని గౌరమ్మను వేడుకుంటాం. తొమ్మిది రోజుల పాటు ఆనందంగా ఉంటుంది. ఊ రూ..వాడంతా కలిసి ఒక్కచోట చేరి బతుకమ్మ ఆటపాటలు ఆడటం మధురానుభూతి కలుగుతుంది. పెంచే ఈపండుగను పూర్వీకుల నుంచి అనుసరిస్తున్నాం.

– చీకోటి జ్యోతి, సిరిసిల్ల

అన్ని పూలతో పేరుస్తాం



బతుకమ్మను శ్రీ చక్ర ఆకారంలో పేరుస్తాం. అమ్మవారి రూపంగా భావిస్తాం. బతుకమ్మను పేరవడానికి అన్ని రకాల పూలను వినియోగిస్తాం. చిన్న నుంచి పెద్దవారు వరకు అందరూ కలిసిమెలిసి జరుపుకునే తొమ్మిది రోజులుగా పండగ. చప్పట్లు, కోలాటంతో బతుకమ్మను ఆడుతాం. గౌరీమాతాగా పూజించి పసుపు, కుంకుమలు ముత్తైదువులకు పెట్టుకొని సౌభాగ్యంగా భావిస్తాం.

– ఎల్లంకి వాణి, సిరిసిల్ల

సంస్కృతికి ప్రతీక



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ. రాష్ట్రంలోనే ప్రకృతి పూలను గౌరమ్మగా కొలిచే ఆనవాయితీ ఉంది. రోజు పూలతో బతుకమ్మ పేర్చడం, సాయంత్రం ఆటపాటలతో తేలిపోవడం చాలా సరదాగా ఉంటోంది. బతుకమ్మ మహిళలందరికీ ఇష్టమైన పండుగ. మహిళలు ఉల్లాసంగా..ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం విశేషం.

– చింతోజు అనూష, సిరిసిల్ల

మార్కెట్‌కు పండుగ కళ









- బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో మార్కెట్లో సందడి
- దుస్తులు, మహిళల అలంకరణ సామగ్రికి గిరాకీ
- చిరు వ్యాపారులకు ఉపాధి
- అన్ని డిజైన్లలో లభ్యం

సిరిసిల్లటౌన్: మార్కెట్‌కు పండుగ కళ వచ్చింది. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో జిల్లా వాసులు కొత్తబట్టలు, అలంకార సామగ్రి కొనేందుకు బారులు తీరుతున్నారు. జ్యు వెల్లరీ గాజులు, ఇతర అలంకార సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. జిల్లాకేంద్రంలో వారం రోజుల నుంచి అలంకార సామగ్రి కొనుగోళ్లతో చిరు వ్యాపారుల 'రోడ్‌సైడ్ బిజినెస్' పై కథనం..

అలంకరణపై ఆసక్తి

పండుగల సందర్భంగా అతివలు అలంకరణపై ఆసక్తి చూపుతున్నారు. ధరించే డ్రెస్సులకు మ్యాచింగ్ అయ్యేలా ఆభరణాలు ఎంపిక చేసుకుంటున్నారు. వ్యాపారులు దూర ప్రాంతాలు, మహానగరాల నుంచి మహిళలను ఆకట్టుకునే అలంకరణ వస్తువులను తెచ్చి విక్రయిస్తున్నారు. దుకాణాదారులే కాకుండా చిరు వ్యాపారులు సైతం తోపడుబండ్లపై రకరకాల ఆభరణాలు విక్రయిస్తూ పండుగ వేళ ఉపాధి పొందుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి మహిళలు షాపింగ్ కోసం పట్టణానికి రావడంతో రోడ్‌సైడ్ దుకాణాల వద్ద బారులుతీరడంతో మార్కెట్‌కు గిరాకీ పెరిగింది.

ఆకట్టుకునే డిజైన్లలో ఆభరణాలు

జ్యూవెల్లరీ షాపుల్లో ఆకట్టుకునే డిజైన్లలో ఆభరణాలను వ్యాపారస్తులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గోల్డ్, రోల్డ్‌గోల్డ్, గోల్డ్ ప్లెటేడ్ వంటి ఆభరణాలు వెరైటీ డిజైన్లలో లభ్యమవుతున్నాయి. గాజులు, కమ్మలు, మాటీలు, వంకీలు, ఉంగరాలు, బ్రాస్‌లైట్, వడ్డానాలు, తదితర ఆభరణాలు లభిస్తున్నాయి. మెడలో వేసుకునే చైన్‌లు, లాకెట్, లాంగ్ చైన్, నెక్లెస్‌లు వంటి అలంకరణ వస్తువులు పలు రకాల మోడళ్లలో మార్కెట్లో దొరుకుతున్నాయి.

చిరు వ్యాపారులకు ఉపాధి

రోడ్డువెంట బండ్లు, పందిళ్లు వేసుకుని సీజనల్ బిజినెస్ చేసే చిరువ్యాపారులకు పండగ పూట ఉపాధి లభిస్తుంది. రకరకాల ఆభరణాలు, కాస్మోటిక్స్, పూసల దండలు, హెయర్‌రింగ్, బ్యాండ్‌లు, జడ బిల్లలు, పూసల నెక్లెస్‌లు తదితర వాటిని విక్రయిస్తున్నారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, గాంధీచౌక్, విమల్ టాకీస్ రోడ్, పెద్దబజార్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపక్కన బండ్లు పెట్టుకొని ఉపాధి పొందుతున్నారు. మార్కెట్‌కు పదుల సంఖ్యలో లేడీస్ ఎంపోరియాలు, రోడ్డుపై చిరు వ్యాపారుల దుకాణాలు ఉండగా అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలలో కాస్మోటిక్స్, ఆభరణాలు అమ్మకాలు జరుపుతున్నారు.

గిరాకీ పెరిగింది



పండుగ సందర్భంగా గిరాకీ పెరిగింది. హైదరాబాద్ నుంచి వచ్చి దుకాణం ఏర్పాటు చేశాను. షోరూమ్స్, దుకాణాల్లో లభించినట్లుగానే అన్ని రకాల చైన్లు, రింగ్‌లు, కాస్మోటిక్ వస్తువులు లభ్యమవుతున్నాయి. బండిపై వ్యాపారాన్ని కొనసాగిస్తున్నా.

– బూర్ల ప్రవీణ్, చిరువ్యాపారి

పది రోజులుగా కొనుగోళ్లు



పదిరోజుల నుంచి కొనుగోళ్లు పెరిగాయి. కొత్త మోడళ్లపై మహిళలు, యువతులు ఆసక్తి చూపిస్తున్నారు. గాజులు, కమ్మలు, చైన్ వంటి వాటిని కొనుగోలు చేస్తున్నారు. మహిళలకు సంబంధించి అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి.

–లక్ష్మి, బ్యాంగిల్‌స్టోర్ నిర్వాహకురాలు

కొత్త డిజైన్లలో



మార్కెట్‌లో మంచి మోడళ్లలో ఆభరణాలు లభిస్తున్నాయి. కొత్త డిజైన్లలో చైన్‌లు, పూసల దండలు, నెక్లెస్ తదితర వస్తువులు దొరుకుతున్నాయి. నగరాల్లో షోరూమ్స్‌లో లభించే అన్నిరకాల జ్యూవెల్లరీ పట్టణంలోని అన్ని సాధారణ షాపుల్లో లభిస్తున్నాయి.

– సుద్దాల మాధురి, తంగళ్లపల్లి



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శివారు రాయపల్లి వాగు వద్ద వీర్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో రోడ్డుపై అడుగో గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాయపల్లివాగుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనాలు దెబ్బతింటున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్
ఆర్‌అండ్‌బీ ఏఈఈ: సెల్: 9440818864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



అఖండ జలాభిషేకంలో పాల్గొన్న భక్తులు



బోయినపల్లిలో దుర్గామాత శోభాయాత్ర



వేములవాడ పట్టణంలో..

సిరిసిల్లటౌన్: పట్టణంలోని మానేరు తీరాన కొలువైన అంబాభవాని, పాతపోచమ్మ ఆలయాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. పాతపోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మానేరు నదిలో గంగమ్మ తల్లికి సారె, హారతి సమర్పించి, నది జలాలను భక్తులు తీసుకొచ్చి అమ్మవారికి అఖండ జలాభిషేకం చేశారు. పట్టణంలోని వాడవాడలా దుర్గామాత మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆలయ ఈవో రాజయ్య, గొల్లపెల్లి పరుశరాములు, డైరెక్టర్లు కుంగుల్‌వార్ దిలీప్, బూర్ల దశరథం, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంజనీయూత్ ఏటా ఏర్పాటు చేసే అమ్మవారిని ఈసారి సైతం ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇపురవీధుల్లోంచి సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, గూడెం, నామాపూర్ తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని మండపాలకు తరలించారు.

బోయినపల్లి: బోయినపల్లి దేవీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. బీసీ కాలనీ నుంచి బస్‌స్టాండ్ అంబేద్కర్ చౌరస్తా, యూనియన్ బ్యాంకు, పోస్టాఫీసుల మీదుగా రామాలయం వరకు దుర్గామాత శోభాయాత్ర జరిగింది.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ దేవస్థానంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. పద్మశాలీ సంఘం సభ్యులు మచ్చ శ్రీనివాస్, అంకారపు రవీందర్, భీమిని అశోక్, మచ్చ ఆంజనేయులు, బండి జగన్, గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని గాలిపెల్లి, నర్సక్కపేట, పెద్ద లింగాపూర్, ఇల్లంతకుంట, వెల్జీపూర్ తదితర గ్రామాల్లో మండపాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవి రూపంలో దర్శనమిచ్చారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించారు. రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో యూత్ సంఘాల ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాలను ఊరేంచారు. మొదటి రోజు మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల నిర్వహకులు మొక్కులు చెల్లించుకున్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి.

మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎల్లారెడ్డిపేట: పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మీస లక్ష్మణ్ కోరారు. సోమవారం పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. నిత్యావసర సరుకులు ధరలను పెంచి ప్రభుత్వాలు కార్మికులపై మోయలేని భారం మోపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిడ్ డే మీల్స్‌ను ప్రైవేటు పరం చేస్తామని ఆలోచనను వెంటనే విరమించుకోవాలని సూచించారు. మెనూ చార్జీలు పెంచాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు. నెలనెల పెన్షన్ రూ. 5వేలు ఇవ్వాలని , ఇన్సూరెన్స్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 20 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేశ్వరి, నరసవ్వ, జ్యోతి, కీర్తన, భాగ్యవ్వ, లక్ష్మి, పోశవ్వ, రాజవ్వ, సత్తవ్వ, రాజమణి, సుశీల, చంద్రకళ, బాలమణి, నరసవ్వ తదితరులు పాల్గొన్నారు.


శివకేశవుల ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం



విగ్రహాలను తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివకేశవుల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా ఉత్సవాలను సోమవారం వైభవంగా ప్రారంభించారు. మూడురోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శాంతిపాఠం, మహా గణపతిపూజ, అఖండ దీపారాధన, మాతృక, నాందీదేవతాహ్వానమం, ఆచార్యయాది బుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశనం, కంకనాధారణముల పూజలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, మండల దేవతాస్థాపనం పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, వేదపండితులు పాల్గొన్నారు.

రామ రామ రామ ఉయ్యాలో..



రుద్రంగిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోనరావుపేట: బావుసాయిపేటలో ..

కోనరావుపేట: ఎంగిలి పూలతో మొదలైన బతుకమ్మ వేడుకలు మండలంలో కొనసాగుతున్నాయి. రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీ రామ ఉయ్యాలో... చిత్తు చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మా అంటూ సోమవారం గ్రామ గ్రామాన మహిళలు బతుకమ్మలు పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఉత్సాహంగా ఆడిపాడారు.

రుద్రంగి: బతుకమ్మ వేడుకలు మండలంలో కొనసాగుతున్నాయి. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఆడారు. మహిళలు, రుద్రంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. సముద్రలింగాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు.

ఆలయంలో చోరీ



రుద్రంగి: మండలకేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ తాళాన్ని పగులగొట్టి హుండీలోని నగదు, ఇతర సామగ్రిని దొంగిలించారు. ఆలయ పూజారి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణంలో..

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఓ దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు సాదుల ఆగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి దుకాణం తాళం పగులగొట్టి ఉండగా లోపలికి వెళ్లి పరిశీలించాడు. రూ.6వేల నగదుతోపాటు ఇతర వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించాడు. చోరీపై ఆగయ్య పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

వీధి దీపాలు అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్‌లో విద్యుత్ దీపాలు లేక అంధకారంగా మారడంతో గ్రామస్తురాలు వెలిశాల జ్యోతి రూ.40 వేల విలువైన విద్యుత్ బల్బులు, వైర్ బండల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్‌కు సోమవారం అందజేశారు. గ్రామంలో, మానేరు వాగు బతుకమ్మ నిమజ్జనం స్థలం వరకు విద్యుత్ బల్బులను అమర్చేందుకుగాను వీధి దీపాలను గ్రామపంచాయతీకి అందజేశారు, కార్యక్రమంలో ముత్యం అమర్ గౌడ్, శ్రీనివాస్, రోషాలు, శ్రీనివాస్, భాగ్య ,దేవవ్వ,లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు

చందుర్తి: బెల్టుషాపు నిర్వాహకుడిపై దాడిచేసిన ఘటన మండలంలోని రామన్నపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడి వద్దకు ఇదే గ్రామానికి చెందిన యువకుడు మద్యం ఉద్దెర కావాలని అడిగారు. నిర్వాహకుడు ఇవ్వకపోవడంతో ఉద్దెర అడిగిన వ్యక్తి తమ్ముడు నిర్వాహకుడిపై దాడిచేశారన్నారు. దీంతో అతను డయల్ 100కు ఫిర్యాదు చేశారు. మద్యం కోసం దాడిచేశారని గ్రామస్తులు తెలిపితే పోలీసులు మాత్రం కిరాణం దుకాణానికి వచ్చి ఉద్దెర అడిగితే ఇవ్వకపోతే దాడిచేశారని ఎస్సై తెలపడం కొసమెరుపు.

నేడు వైద్యుల నిరసన

సిరిసిల్ల అర్బన్: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని గవర్నమెంట్ మెడికల్ కళాశాల తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ యూ నియన్ అధ్యక్షుడు డాక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. దాడిని ఖండిస్తూ టీటీజీడీఏ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి మేరకు మంగళవారం నిరసన తెలపాలన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంలో ఓ గుడిసెలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. రెండు లీటర్ల నాటు సారా, 20 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకుపై కేసు

తంగళ్లపల్లి: తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకుపై కేసు నమోదు చేశామని ఎస్సై ఉపేంద్రాచారి తెలిపారు. మండలంలోని పద్మనగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్ తల్లిదండ్రులను సరిగా పట్టించుకోకపోవడమే కాకుండా అసభ్యకరంగా దూషిస్తున్నాడు. పద్మనగర్‌లో ఉన్న ప్లాట్‌ను అమ్మి డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నాడన్నారు. తల్లిదండ్రులు వేముల విజయ, బుచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.